సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 23 । జూలై । 2024



గంగవరం పోర్టులో అగ్ని ప్రమాదం

అదానీ గంగవరం పోర్టులో **ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.** 8లో



కుష్టు నివారణే లక్ష్యం

జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే కొనసాగనుంది. 8లో



వర్షనష్టం వివరాలు అందజేయాలి

ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన నష్టం వివరాలను తక్షణమే అందజేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

7న జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు



దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలకు గంట మోగింది. ప్రస్తుత స్థాయీ సంఘం కాలపరిమితి ముగిసినందున, ఈ ఏడాదికి సంబంధించి స్థాయీ సంఘం సభ్యులను ఎన్నుకునేందుకు విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరింప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్(జనరల్) కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలు కార్యాలయ పనివేళల్లో జీవీఎంసీ కార్యదర్శి విభాగం నుంచి పొందవచ్చని తెలిపారు. 31న ఉదయం 11 గంటలకు నామినేషన్ల స్క్రూటినీ, అదే రోజున అర్హత గల నామినేషన్ల జాబితా ప్రకటిస్తారన్నారు. వచ్చే నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని తెలిపారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారన్నారు. 7వ తేదీన ఓటింగ్, అనంతరం ఓట్ల లెక్కింపు, తుది ఫలితాలు ప్రకటిస్తారు.

విశాఖకు 14 మంది ఎస్ఐలు

ఇక్కడి నుంచి 14 మంది రేంజ్‌కు బదిలీ



విశాఖ సిటీ: విశాఖ రేంజ్ నుంచి 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు నగరానికి కేటాయించారు. అలాగే ఇక్కడి నుంచి 14 మంది శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు బదిలీ చేశారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం నుంచి డి.సూరిబాబు, కె.నరసింగరావు, పి.డి.బి.శంకర్, కె.శ్రీనివాసరావు, ఎన్.సింహాచలం, జి.శ్యామలరావు, ఐ.నాగరాజు విశాఖకు బదిలీ చేశారు. విజయనగరం నుంచి డి.తాతారావు, డి.రాము, ఎ.మోహనరావు, పార్వతీపురం మన్యం నుంచి కె.సత్యనారాయణ, పి.వి.రమణారెడ్డి, ఎం.వి.రమణ, కె.దేముడునాయుడులను విశాఖకు కేటాయించారు. అలాగే విశాఖ నుంచి ఎ.సింహాచలం, ఎ.వరదరాజులు, సి.హెచ్.వి.మోహనరావు, ఎం.వెంకటరావు, ఆర్.శంకరరావు, వి.జగదీశ్వరరావు, సి.హెచ్.శంకరరావు, పి.ఈశ్వరరావు, ఎం.సూర్యారావు, డి.సూర్యనారాయణ, జామి సత్యనారాయణ, ఎం.ఎ స్.వి.ప్రసాదరావు, పి.రఘునాథరావు, వి.దేవదానంలను ఇతర జిల్లాలకు కేటాయించారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ తుది దశ కౌన్సెలింగ్

మురళీనగర్: ఏపీఈఏపీసెట్ తుదిదశ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం అవుతుందని కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు వారికి కేటాయించిన కాలేజీల్లో చేరడానికి సోమవారంతో గడువు ముగిసింది. ఆయా కాలేజీల్లో మిగిలిన సీట్లు బుధవారం నాటికి సాంకేతిక విద్యాశాఖకు చేరుతుంది. ఈ నేపథ్యంలో ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను కన్వీనరు/డీటీఈ ప్రకటించారని తెలిపారు. 23 నుంచి 25 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన, ఆన్‌లైన్‌లో సమర్పించిన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. 24 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు, 27న ఆప్షన్ల మార్పిడికి అవకాశం ఇచ్చారు. ఈనెల 30న సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈనెల 31 నుంచి ఆగస్టు 3వ తేదీ లోగా సెల్ఫ్ రిపోర్టుతోపాటు కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. విశాఖ జిల్లాకు సంబంధించి కంచరపాలెం పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు హెల్ప్‌లైన్ కేంద్రం పనిచేస్తుంది.

పారిస్ ఒలింపిక్స్‌కు విశాఖవాసి

టెక్నికల్ అఫీషియల్‌గా బాక్సింగ్ వెంకటేశ్వరరావు

విశాఖ స్పోర్ట్స్ : పారిస్ ఒలింపిక్స్‌లో విశాఖకు చెందిన బాక్సింగ్ కోచ్ ఐ.వెంకటేశ్వరరావు సేవలందించనున్నారు. ద్రోణాచార్య అవార్డీ వెంకటేశ్వరరావు ఈ మేరకు భారత బాక్సింగ్ సమాఖ్య నుంచి సోమవారం ఉత్తర్వులు అందుకున్నట్లు 'సాక్షి'కి తెలిపారు. టెక్నికల్ అఫీషియల్స్ న్యూఢిల్లీ నుంచి బుధవారం బయలుదేరనున్నామన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న కాంటింజెంట్ అరుగురు సభ్యులు ఇప్పటికే జర్మనీలో ప్రీఒలింపిక్ సెషన్ ఈవెంట్‌లో శిక్షణ పొందుతున్నారు. భారత్ నుంచి తొమ్మిది మంది శిక్షకులు, సపోర్టింగ్ స్టాఫ్‌గా ఒలింపిక్స్‌లో సేవలందించేందుకు సమాఖ్య ఎంపిక చేయగా వారిలో వెంకటేశ్వరరావు ఒకరు. ఈయన గతంలో విశాఖలోని భారత క్రీడా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సెంటర్(సాయ్)లో కోచ్‌గా సేవలందించి పదవీ విరమణ చేశారు.

అధ్యక్షా... ఇదీ మా గుండె చప్పుడు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రజా ప్రతినిధులుగా జిల్లా ఎమ్మెల్యేలు తమ ప్రాంతానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించేందుకు వచ్చిన చక్కని అవకాశమిది. ఎన్నో ఆశలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తమ హామీలు కార్యరూపం దాల్చేలా శాసనసభ్యులు సభలో గట్టిగా ప్రస్తావించవలసి ఉంటుంది. సమస్యలను వివరించి నిధులు రాబట్టాల్సి ఉంటుంది. జిల్లా నుంచి ఎన్నికైన తమ ఎమ్మెల్యేలు సభలో ఎలా వ్యవహరిస్తారా అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాలని వారు కోరుతున్నారు.

- అభివృద్ధిపై దృష్టి సారిస్తారా? హామీలు అటకెక్కిస్తారా?
- అసెంబ్లీలో జిల్లా అంశాలు ప్రస్తావించాలని కోరుతున్న ప్రజలు
- గత ప్రభుత్వం చేపట్టిన మంచి పనులను కొనసాగించాలని వినతి

సాక్షి, విశాఖపట్నం : ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం. వారి ఓట్లతో అధికార పీఠమెక్కిన నాయకులు ప్రజాసేవకే అంకితం కావాలి. భారత రాజ్యాంగం ఆశించిందీ, ప్రజలు కోరుకుంటున్నదీ అదే.. కానీ సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి అధికార దండం అందుకున్న కూటమి ప్రభుత్వంలో పరిపాలన కన్నా ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు, దాడులే ఎక్కువగా జరుగుతున్నాయి. కొత్తగా చేపడుతున్న అభివృద్ధి పనులేవీ లేకున్నా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోని శాశ్వత అభివృద్ధి పనుల తాలూకా శిలాఫలకాలనూ ధ్వంసం చేస్తున్నారు. చివరకు అనేక అద్వితీయ సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలనే ఎంతో మెరుగుపర్చిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీ నాయకులపై ప్రజలకు సందేహాలు కలుగుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతారా? మళ్లీ ఎగేస్తారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఆయా హామీల సాధనకే కాదు స్థానిక ప్రాంతాల్లో సమస్యలపైనా ప్రజల గుండెచప్పుడును టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో వినిపించే విధానంపైనా వారి పనితీరు ఆధారపడి ఉంటుంది.

స్టీల్‌ప్లాంట్‌పై ఏమిచేస్తారో..?

ఎన్నికల ముందు తర్వాత కూడా స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామంటూ జిల్లా ఎమ్మెల్యేలంతా బాహాటంగానే ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉక్కు కార్మికులకు అన్నివిధాలా సహాయ సహకారాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న గర్భాం మాంగనీస్ గనులు, కింతాడ క్వార్ట్జ్ మైన్స్, సారిపల్లి ఇసుక రీచ్‌లు నెలలోగా స్టీల్‌ప్లాంటుకు రెన్యువల్ చేస్తామని హామీ ఇచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయింపునకు కృషి చేస్తానని ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఇటీవల కార్మిక సంఘ నాయకులు కలిసిన సమయంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హామీ ఇచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ కాకుండా కాపాడేందుకు అసెంబ్లీలో తీర్మానం పెట్టింది. ఈ ప్రభుత్వంలో ఏ విధమైన ఆలోచనతో ముందుకెళ్తారా? అనేదానిపై ఉక్కు ఉద్యోగులే కాదు జిల్లా ప్రజలంతా ఎదురు చూస్తున్నారు.



ఎమ్మెల్యేలు గళం వినిపిస్తారా?

నియోజకవర్గాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామంటూ హామీలిచ్చిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో స్థానిక సమస్యల్ని వినిపిస్తారని ఆశిస్తున్నారు. భీమిలి నుంచి గాజువాక వరకూ ప్రతి ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలుపుతామంటూ పలికారు. అయితే గళం వినిపిస్తారా? గాలికొదిలేస్తారా అనేది తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే తేలిపోతుందని ప్రజలు భావిస్తున్నారు.

- పంచగ్రామాల సమస్యను పరిష్కరిస్తామని చంద్రబాబు సహా ఎమ్మెల్యేలంతా హామీ ఇచ్చారు. దానిపైనా స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.
- ఐటీ కంపెనీలు తీసుకొస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దానిపై చర్చించాలని యువత డిమాండ్ చేస్తోంది.
- భీమిలి నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేసేలా ప్రాజెక్టులు, సంస్థలు తీసుకొస్తానని హామీలిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఈ అంశాలను ప్రస్తావించాలని భీమిలి ప్రజలు కోరుతున్నారు.
- తాడి గ్రామం తరలింపుపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా హామీ ఇచ్చారు. దీనిపైనా చర్చ జరగాలని పెందుర్తి నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.
- నక్కపల్లిలో 5 వేల ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్కుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్రూవల్ వచ్చింది. స్టార్టప్ ఏరియా కోసం 1100 ఎకరాలు సిద్ధం చేశారు. రూ.399 కోట్లు మంజూరు చేశారు. రైతుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించాలని టీడీపీ డిమాండ్ చేసింది. ఇప్పుడు ఆ డిమాండ్‌ను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి.
- అనకాపల్లి మండలం కోడూరులో 129 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు అభివృద్ధికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తొలి దశలో 59 ఎకరాలను అభివృద్ధి చేశారు. అక్కడ రూ.12.63 కోట్లతో రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేస్తే వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై గళమెత్తాలి



ఎన్నికల ముందు కూటమి నాయకులు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదలకు కృషి చేస్తామని, విజయనగరం జిల్లాలో ఉన్న ఇసుక, మాంగనీసు గనుల లీజులు పునరుద్ధరిస్తామని, ప్లాంట్ విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆరు నెలలు వాయిదా వేయాలన్న డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇచ్చారు. వీటిపై అసెంబ్లీలో ప్రస్తావించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రకటన చేసేలా ప్రయత్నిస్తారని ఆశిస్తున్నాం.

– జి.వెంకటరెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి

టోల్‌ప్లాజాకు శాశ్వత పరిష్కారం చూపించాలి



అగనంపూడి టోల్ గేటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి. ఇన్నాళ్లూ వసూలు చేసింది చాలదన్నట్లు మళ్లీ టెండర్లు పిలవడం దారుణం. విశాఖలో ఫ్లైఓవర్లు నిర్మిస్తామని, సుందరీకరణ చేస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం విడ్డూరంగా ఉంది. ఇదే విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి టోల్ విరుగుడ అయ్యేలా కృషి చేయాలి.

– పట్టా రామఅప్పారావు, ఆర్టీఐ యాక్టివిస్ట్

బైక్ వెనుక ఉన్న వారికి హెల్మెట్ తప్పనిసరి

లేకుంటే రూ.1035 చలానా



మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

విశాఖ సిటీ: ద్విచక్ర వాహన చోదకులతోపాటు వెనుక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల ప్రకారం హెల్మెట్ ధారణపై నగరంలోని 44 ప్రధాన జంక్షన్లలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్లు కూడా బీఐఎస్ మార్కు ఉన్న వాటినే ధరించాలని సూచించారు. బైక్ నడిపే వారే కాకుండా వెనుక కూర్చున వారు హెల్మెట్ ధరించకపోయినా రూ.1035 చలానా విధిస్తామని తేల్చి చెప్పారు. హెల్మెట్ ధరించకుండా ప్రమాదానికి కారణమైన వారి డ్రైవింగ్ లైసెన్సు మూడు నెలల పాటు సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థ సహకారంతో కొంత మందికి హెల్మెట్లు అందించే కార్యక్రమం గురించి సీపీ శంఖబ్రత బాగ్చి ఆలోచన చేస్తున్నారని త్వరలోనే దీనిపై విధి విధానాలను రూపొందించి ప్రకటిస్తామని వెల్లడించారు.

చలానాలు చెల్లించాలి : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చలానాలు వేయడం జరుగుతోందన్నారు. ఆ చలానాలను మొబైల్‌లోని యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. ఇందుకోసం ప్లేస్టోర్ నుంచి NextGenmParivahan అనే అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని అందులో అడిగిన వివరాలు నింపి ఎంపిన్ జనరేట్ చేసుకోవాలని చెప్పారు. అప్లికేషన్‌లో ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ అనే ఐకాన్ క్లిక్ చేసిన తరువాత పేమెంట్ చలానా అనే ఆప్షన్ ఎంచుకొని, వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్, చివరి 5 అంకెల ఛాసిస్ నెంబర్, ఇంజన్ నెంబర్ ఎంటర్ చేసి వాహనంపై ఉన్న చలానాలు తెలుసుకోవచ్చన్నారు. అందులో పేమెంట్ గేట్‌వే ఎంచుకొని చలానా చెల్లించాలన్నారు.

కూటమి తీరు సిగ్గుచేటు

- వైఎస్సార్ సీపీ బీ ఫారంపై గెలిచిన కార్పొరేటర్లను ఆహ్వానించడం సరికాదు
- టీడీపీలో చేరిన వారిని నేరస్తులుగా వరుసగా నిలబెట్టారు..
- చేరినవారు ఆవేదనతో ఉన్నారు.. పునరాలోచిస్తున్నారు..
- వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్ : వైఎస్సార్ సీపీ బీ–ఫారంపై గెలిచిన కార్పొరేటర్లను కూటమి పార్టీలు ఆహ్వానించడం సిగ్గుచేటని జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమూరి సతీష్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ చాంబర్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ బీ–ఫారం పొంది ఎన్నికల్లో విజయం సాధించిన పలువురు కార్పొరేటర్లు కూటమి పార్టీల్లో చేరడంలో ఆంతర్యమేంటో తెలపాలన్నారు. మేయర్ పీఠం కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలు అడ్డదారులు తొక్కడం విడ్డూరంగా ఉందన్నారు. అందుకు వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లకు ఎర వేయడం, ప్రలోభాలకు గురిచేయడం, వ్యాపారరీత్యా పనులు సాగనివ్వమని బెదిరింపులకు పాల్పడడం సరికాదన్నారు. ఈ సంప్రదాయం ఏ పార్టీకీ మంచిది కాదని హితవు పలికారు. అలాగే టీడీపీలో చేరిన పలువురు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు కండువా కప్పి వరుసగా నేరస్తులుగా నిలబెట్టడం చూస్తుంటే ఆ పార్టీలో వారికి ఏ స్థాయి విలువ ఉంటుందో ఇట్టే తెలుస్తోందన్నారు.

వారు ఆవేదనతో ఉన్నారు..

టీడీపీలో చేరిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు స్వచ్ఛందంగా తిరిగి వస్తారని, ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఎందుకు వెళ్లామా? అనే మీమాంసలో ఉంటూ తమకు ఫోన్లు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వెళ్లిన వారిలో సగం మంది వైఎస్సార్ సీపీలో పలు పదవులు అనుభవించినవారేనని, మరి ఏమి ఆశించి కూటమిలో చేరారో వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ సింబల్‌తో గెలిచిన తర్వాత మారాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో? వారికి ఏ పార్టీ గౌరవం ఇచ్చిందో తెలుసుకోవాలన్నారు. ఇంకా మిగిలింది 19 నెలలే తెలుసుకోవాలన్నారు.

'స్థాయీ' ఎన్నికల్లో శత శాతం గెలుస్తాం..

గత మూడుసార్లు జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో శత శాతం గెలుచుకున్నాం.. వచ్చే నెల 7వ తేదీన నిర్వహించనున్న స్థాయీ సంఘం ఎన్నికల్లో కూడా గెలిచి తీరుతామని వారు తెలిపారు. స్థాయీ సంఘం ఎన్నికలు, కౌన్సిల్ సమావేశం విషయమై ఇన్‌చార్జ్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశామని, 7వ తేదీన స్థాయీ సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని, ఈ ఎన్నికల అనంతరం ఆగస్టు రెండో వారంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు అంగీకరించారన్నారు. కౌన్సిల్ సమావేశంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన పలు అభివృద్ధి పనులు, వార్డుల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు.

నెల రోజుల్లోనే ఇన్ని దాడులా..

ఐదేళ్లు చంద్రబాబు అధికారంలో లేకపోతే 25 ఏళ్లు అధికారంలో లేనట్టుగా భావిస్తూ 45 రోజుల్లోనే ఇన్ని దాడులా? అని వారు ప్రశ్నించారు. తమకు వచ్చినవి 40 శాతం ఓట్లు.. తమకు తగ్గింది కేవలం 10 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టనున్న నిరసనకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పయనమవుతున్నామని చెప్పారు.

ఎస్ బాస్

- పోలీస్ శాఖలో.. బాసిజం..
- కష్టం కింది స్థాయి సిబ్బందిది.. హడావుడి ఉన్నతాధికారులది
- రబ్బరు స్టాంపుల్లా ఇన్‌స్పెక్టర్లు.. గోప్యంగా ఎఫ్ఐఆర్‌లు
- స్టేషన్లలో రైటర్, ఎస్ఐ, సీఐ నోళ్లకు తాళాలు
- కేసుల దర్యాప్తులు తప్పా.. వివరాలు వెల్లడించే అధికారం ఇవ్వని ఆఫీసర్లు
- ప్రతి చిన్న కేసు తామే ఛేదించినట్లు మీడియా ముందు అధికారుల హంగామా

విశాఖ సిటీ : విశాఖ పోలీస్ శాఖలో బాసిజం తారాస్థాయికి చేరింది. కింది స్థాయి సిబ్బంది కష్టాన్ని ఉన్నతాధికారుల ఖాతాలో వేసుకుంటున్నారు. చాకచక్యంగా కేసులు ఛేదిస్తున్న వారిని పక్కనపెట్టి.. మీడియా సమావేశాలతో హడావుడి చేయడం పరిపాటిగా మారింది. ప్రధానంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్లను రబ్బర్ స్టాంపుల్లా మార్చేశారు. సీఐ, ఎస్ఐలను కేవలం కేసుల దర్యాప్తులకు తప్పా.. వారికి సరైన గుర్తింపు ఇచ్చే విషయంలో చిన్న చూపు చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏఎస్ఐ ఆ కింది స్థాయి సిబ్బందిని కనీసం పట్టించుకున్న పాపానపోలేదు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బందోబస్తులకే పరిమితం చేస్తున్నారు. కేసులు పెండింగ్ విషయంలో సీఐలను బాధ్యులను చేస్తూ నిందితులను పట్టుకుంటే మాత్రం తమ చొరవతోనే అది సాధ్యమైందంటూ మీడియా ముందు వాలిపోతున్నారు.

నోళ్లకు తాళాలు

నగర పోలీస్ శాఖలో ఉన్నతాధికారుల తీరు చర్చనీయాంశంగా మారింది. కింది స్థాయి అధికారులు, సిబ్బంది నోళ్లకు తాళాలు వేసేశారు. పబ్లిక్ డాక్యుమెంట్ అయిన ఎఫ్ఐఆర్‌లను గోప్యంగా ఉంచుతున్నారు. చిన్న చిన్న కేసుల వివరాలను సైతం బయటకు వెల్లడించడానికి అంగీకరించడం లేదు. గతంలో ఎటువంటి కేసు అయినా.. స్టేషన్ రైటర్ వివరాలు వెల్లడించే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఐలే కాదు.. కొన్ని సందర్భాల్లో ఏసీపీలు సైతం నోరు విప్పే పరిస్థితి లేదు. గతంలో కీలక కేసులు, సంఘటనలను జరిగిన సమయాల్లో మాత్రమే ఉన్నతాధికారులు మీడియా సమావేశాలు పెట్టేవారు. మెజారిటీ కేసుల విషయాలను స్టేషన్‌లో సీఐలు, ఏసీపీలే వెల్లడించే వారు. కానీ ఇప్పుడు ఏ చిన్న కేసు ఎఫ్ఐఆర్‌లో వివరాలైనా.. నిందితులను అరెస్టు చేసినా.. డీసీపీ ఆ పై స్థాయి అధికారులు మీడియా సమావేశం పెట్టి చెప్పాల్సిందే. అనేక సందర్భాల్లో సంఘటన జరిగిన విషయాన్ని గోప్యంగా ఉంచి.. నిందితులను పట్టుకున్న తరువాత గొప్పలు చెప్పకోవడం పరిపాటిగా మారిపోయింది. ఈ క్రమంలో కేసు దర్యాప్తు తీరుపై అనేక సందేహాలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అప్పట్లో కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన వారికి ప్రత్యేక రివార్డులు, అభినందలు ఉండేవి. కానీ ఇటీవల కాలంలో ఆ తరహా గుర్తింపు కూడా లభించకపోవడంతో కొంత మంది అధికారులు, సిబ్బంది అసంతృప్తితో ఉన్నారన్న చర్చ జరుగుతోంది.



కొత్త సీపీ హయాంలో అయినా మారేనా?

విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సిబ్బందికి తగిన ప్రాధాన్యత కల్పిస్తారన్న టాక్ పోలీస్ శాఖలో ఉంది. ఈయన విధులు నిర్వర్తించిన ప్రతి చోటా కింది స్థాయి సిబ్బందికి గుర్తింపు, గౌరవం కల్పించారని అధికారులే చెబుతున్నారు. అయితే విశాఖ కమిషనరేట్‌లో ఒక గ్యాంగ్.. నగరానికి ఏ కమిషనర్ వచ్చినా వారికి సరికొత్త సంప్రదాయాన్ని అలవాటు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. కొత్త సీపీ అయినా ఈ సెంట్రలైజల్డ్ విధానానికి చెక్ పెట్టి.. కమిషనరేట్, ఆ పరిధిలోనే తిరుగుతున్న వారిని పక్కనపెట్టి.. స్టేషన్ అధికారులు, సిబ్బందికి తగిన ప్రాధాన్యత కల్పిస్తారో? లేదో? వేచి చూడాలి మరి.

గరీబ్‌రథ్.. న్యూ లుక్

- కొత్త కోచ్‌లలో హాయి... హాయి..
- గరీబ్‌రథ్‌కు పాత కోచ్‌ల తొలగింపు
- నేటి నుంచి కొత్త కోచ్‌లతో పరుగులు
- పెరగనున్న సీటింగ్ సామర్థ్యం
- అత్యాధునిక వసతులతో కూడిన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్. విశాఖ నుంచి సికింద్రాబాద్ ప్రతిరోజూ నడిచే గరీబ్‌రథ్ ఇక నుంచి కొత్త లుక్‌లో కనిపించనుంది. ఈ రైలుకు ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఇంతవరకు ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడిచిన రైలు మంగళవారం నుంచి ఎల్‌హెచ్‌బీ బోగీలతో దూసుకుపోనుంది. 2008లో ప్రారంభమైన ఈ గరీబ్‌రథ్ ఐసీఎఫ్ (ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ) బోగీలతో నడుస్తోంది. అయితే ఈ ఐసీఎఫ్ బోగీలు పాతబడిపోయి తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఐసీఎఫ్ బోగీలను ఎల్‌హెచ్‌బీ బోగీలుగా మార్చాలని రైల్వేశాఖ నిర్ణయించింది.

పేద, సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులకు ఏసీ కోచ్‌లలో ప్రయాణం కలగా ఉండేది. కానీ భారతీయ రైల్వే 2005లో ఇటువంటి వారి కోసం తక్కువ టికెట్ చార్జీలతో ఏసీ ప్రయాణాన్ని పరిచయం చేసింది. ఇది పేదవారి కోసమే నడిచే రైలు కాబట్టి గరీబ్ రథ్ (పేదవాడి రైలు)గా నామకరణం చేశారు. మామూలు థర్డ్ ఏసీ కోచ్‌ల కంటే కొన్ని తక్కువ సదుపాయాలతో ఈ గరీబ్‌రథ్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖ నుంచి నడిచే ఏకైక గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ 2008 అక్టోబరు 25వ తేదీన ప్రారంభించారు. విశాఖ–సికింద్రాబాద్–విశాఖ మధ్య 2739/2740 నంబర్లతో నాటి నుంచి ఈ రైలు నడుస్తోంది. మొదట్లో ఈ గరీబ్‌రథ్ ట్రై వీక్లీగా నడిచేది. తదనంతరం డిమాండ్‌ను బట్టి 2010 ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రతీరోజు నడుపుతున్నారు. తరువాత ఈ రైలు నంబరు 12739/12740గా మార్చారు. భారతీయ రైల్వేలో ప్రతీరోజు నడిచే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇదొక్కటే కావడం మరో విశేషం. మిగిలిన గరీబ్‌రథ్ రైళ్లన్నీ వీక్లీ, బై వీక్లీగా నడుస్తున్నాయి.

నేటి నుంచి మారిన కోచ్‌లతో..

విశాఖ–సికింద్రాబాద్– విశాఖ గరీబ్‌రథ్ ఇప్పటివరకు పాత ఐసీఎఫ్ కోచ్‌లతో నడుస్తుంది. ఈ గరీబ్‌రథ్ మంగళవారం నుంచి అధునాతన ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పరుగులు తీయనుంది. ఇప్పటివరకు ఈ రైలు 17–థర్డ్ ఏసీ కోచ్‌లతో నడిచేది, ఇకమీదట 18 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడువనుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో ప్రయాణికులకు మరింత సౌకర్యం, మరిన్ని అధునాతన వసతులు సమకూరనున్నాయి. సీటింగ్ సదుపాయం కూడా పెరగనుంది. మరింత వేగం కూడా పెరిగే అవకాశం ఉంది.



చార్జీలు తక్కువే...

సాధారణ మధ్య తరగతి ప్రయాణికుల కోసమే ఈ రైళ్లు ప్రవేశపెట్టారు. అందువల్ల చార్జీలు కూడా వారికి అందుబాటులో ఉండే విధంగా ఉంటాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీలో సికింద్రాబాద్ వెళ్లాలంటే చార్జీ రూ.1080 (ఒక్కరికి), అదే గరీబ్‌రథ్‌లో కేవలం రూ.770 మాత్రమే. విశాఖ నుంచి విజయవాడకు గోదావరి ఎక్స్‌ప్రెస్ థర్డ్ ఏసీ రూ.660 అయితే గరీబ్‌రథ్‌కు కేవలం రూ.495 మాత్రమే.

కొండకు కోపం వచ్చింది

సాక్షి, విశాఖపట్నం : చీమా చీమా ఎందుకు కుట్టావ్ అంటే.. నా బంగారం పుట్టలో చెయ్యి పెడితే కుట్టనా అని అన్నట్లు.. కొండా కొండా.. ఎందుకు కోప్పడుతున్నావ్.. అని అడిగితే.. నన్ను ఆక్రమించి.. అడ్డగోలుగా ఆఫీస్ కడితే ఆగ్రహించనా.. అని చెప్పిందనడానికి సజీవ సాక్ష్యం ఈ చిత్రం. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా.. ఎన్టీఆర్ భవన్‌గా పిలిచే టీడీపీ కార్యాలయ ఆవరణలో బండరాళ్లు విరిగిపడ్డాయి. కొండను ఆక్రమించి ఈ భవనాన్ని నిర్మించడం కారణంగానే.. వర్షాలు ఎప్పుడు కురిసినా.. కొండ నుంచి బండరాళ్లు విరిగి టీడీపీ కార్యాలయంలో పడుతుంటాయి. మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఉన్న దసపల్లా భూముల్లో సర్వే నం.1196/7లో 2000 గజాలను తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి 33 ఏళ్ల పాటు ఏడాదికి రూ.25 వేలు లీజు చొప్పున 2002లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. అయితే కేటాయించిన 2వేల చదరపు గజాలతో పాటు పక్కన ఉన్న కొండను కొంత మేర తొలిగించి 160 గజాలు అదనంగా ఆక్రమించేసి కార్యాలయాన్ని నిర్మించారు. దీంతో కొండ భాగం కొంతమేర తొలగించడంతో బండరాళ్లు పడుతున్నాయి.



టీడీపీ కార్యాలయం వద్ద పడిన బండరాళ్లు

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- పీజీఆర్ఎస్‌కు 189 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం అందే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 189 అర్జీలు అందగా, వాటిలో పింఛన్ల మంజూరు, స్థానిక సమస్యల పరిష్కారం కోరు తూ ఎక్కువగా వినతులు వచ్చాయి. మొత్తం అందిన అర్జీలలో 67 రెవెన్యూ శాఖ, 55 జీవీఎంసీ, 21 పోలీస్ శాఖ, 46 ఇతర శాఖలకు చెందిన అర్జీలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అంతంతమాత్రం

సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. గత వారం 261 ఫిర్యాదులు రాగా.. సోమవారం 189 అర్జీలు మాత్రమే వచ్చాయి.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 56 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 56 వినతులు అందాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్–1 నుంచి ఒకటి, జోన్–2కు 10, జోన్–3కు 9, జోన్–4 కు16, జోన్–5కు ఒకటి, జోన్–6కు 9, జోన్–7కు ఒకటి, జోన్–8కి 5 ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 4 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) శ్రీనివాసరావు, డీడీహెచ్ దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 81 ఫిర్యాదులు వచ్చాయి. సీపీతో పాటు జాయింట్ సీపీ ఫకీరప్ప, ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

సంఘ సేవకురాలు సత్యవతి మృతి



సత్యవతి (ఫైల్)

డాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకురాలు కోసూరు సత్యవతి (97) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. తనకొచ్చే పెన్షన్, కుమారుడు సహకారంతో ఎందరో నిరుపేదలను అక్కున చేర్చుకుని తోచిన సాయం చేస్తుండేవారు. ఆలయాలు, ఆశ్రమాలు, శరణాలయాలు, స్వచ్ఛంద సంస్థలకు వస్త్రాలు విరాళంగా అందజేసి సహృదయవాసిగా ముద్ర వేసుకున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారం ఉషోదయ జంక్షన్ వద్ద శ్మశాన వాటికలో సోమవారం అంత్యక్రియలు జరిపారు.

కుష్టు నివారణే లక్ష్యం

- ఆగస్టు 2 వరకు ఇంటింటా ఎల్సీడీసీ సర్వే
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స



డోర్ టూ డోర్ సర్వే

మహారాణిపేట : జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్సీడీసీ) సర్వే–24 పేరిట నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగనుంది. జిల్లాలో 925 మంది ఆశ కార్యకర్తలు, 54 మంది ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, 86 ఎంపీహెచ్ఎస్‌లు, 72 మెడికల్ ఆఫీసర్లు సర్వే కోసం పనిచేస్తున్నారు. రేవిడి, ఆర్.తాళ్లవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ఎక్కువగా దృష్టి సారించారు. సర్వేలో భాగంగా బృందాలు గుర్తించిన కొత్త కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి పూర్తి స్థాయిలో వైద్యం అందించి దశల వారీగా కుష్టు వ్యాధిని నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు అంటున్నారు. కుష్టు వ్యాధి సోకిన వ్యక్తి ముక్కు నుంచి ద్రవంతో దగ్గు లేదా స్పర్శ ద్వారా వ్యాప్తి చెందుతుంది.

తగ్గుతున్న వ్యాధిగ్రస్తులు

రాను రాను ఈ వ్యాధి తగ్గుముఖం పడుతోంది. 2022లో 96 కేసులు నమోదు కాగా 2023లో 81 కేసులు నమోదయ్యాయి. 2021లో 104 కేసులు నమోదయ్యాయని కుష్టు నివారణాధికారి డాక్టర్ సత్యవాణి తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్య సేవలందిస్తారు. శరీరంపై ఐదు మచ్చలున్న వారికి పాసిబ్యాసిలరీ(పీబీ) విధానంలో ఆరు నెలలు పాటు చికిత్స అందిస్తారు. అలాగే ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలలు చికిత్స అందిస్తారు. దీనిలో భాగంగా నెలకు ఒక సారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత నుంచి బహుళ ఔషధ చికిత్స(మల్టీ డ్రగ్ థెరఫీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇవీ..

- చర్మంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు
- చెవులపై బొడిపెలు, కణితులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం(చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం),
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాల మడమల్లో వాపు
- ముప్పు దిబ్బడం, ముక్కు నుంచి రక్తం కారడం

సర్వేకు సహకరించాలి



కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత లేకుండా నివారణకు కృషి చేయాలి. గ్రామస్థాయిలో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో సర్వే జరుగుతుంది. వ్యాధి లక్షణాలు ఉన్న వారు వివరాలు అందించాలి. ఏమాత్రం అనుమానం ఉన్నా.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా కుష్టు నివారణ అధికారి

ఊర్వశి జంక్షన్‌లో కార్లు ఢీ



మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఊర్వశి జంక్షన్‌కు సమీపంలో ఓ లారీ నిలిచిపోయింది. అనకాపల్లికి చెందిన ఓ మహిళ తన కొత్త కారులో అటువైపు వస్తూ ఆగి ఉన్న లారీని గమనించక షడన్ బ్రేక్ వేసింది. దీంతో ఆ వెనుక వస్తున్న నాలుగు కార్లు ఒకదానిదో ఒకటి ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి



మృతుడు అప్పారావు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో ఓ యువకుడు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందినట్టు ఏఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. అనంతవరం గ్రామానికి చెందిన కోరెడ్డి అప్పారావు (29) సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడి కక్కడే మృతి చెందాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. మృతుడు అప్పారావుకు ఇంకా వివాహం కాలేదు. మృతుడు అప్పారావుకు తల్లి సత్యమమ్మ, సోదరి గౌరి ఉన్నారు. గౌరీకి వివాహం అయింది. అప్పారావు మృతితో తల్లి సత్యమమ్మ, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఇన్‌స్పైర్ –మనక్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్ రీసెర్చ్(ఐఎన్ఎస్‌పీఐ ఆర్ఈ) – మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్ (ఎంఏఎన్ఏకే) పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ ఇతర జిల్లా అధికారులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షనష్టం వివరాలు అందజేయాలి

మహారాణిపేట: జిల్లాలో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు జరిగిన నష్టం వివరాలను తక్షణమే అందజేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వల్ల జరిగిన నష్టం నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి తక్షణం సమర్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖలు, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, నీటి పారుదల, జీవీఎంసీ, విద్యుత్, ఫైర్ తదితర శాఖలను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, జిల్లా అధికారులు, జీవీఎంసీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జా గురైన స్టీల్‌ప్లాంట్ స్థలం స్వాధీనం



స్టీల్‌ప్లాంట్ స్థలంలో తొలగించిన ప్రహరీ

మద్దిలపాలెం: హెచ్‌బీకాలనీలో వివాదస్పద స్టీల్ ప్లాంట్ స్థలాన్ని హైకోర్టు ఆదేశాల మేరకు యాజమాన్యం స్వాధీనం చేసుకుంది. స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌కు ఆనుకుని ఉన్న 15 గజాల ప్లాంట్ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి ప్రహరీ నిర్మించారని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కోర్టు ఆశ్రయించింది. దీంతో ఆ స్థలాన్ని ఖాళీ చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై స్టీల్‌ప్లాంట్ అధికారులు హుటాహుటిన నిర్మించిన ప్రహరీని తొలగించి స్వాధీనం చేసుకొన్నారు. అయితే సదరు ప్రైవేట్ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. అదే వ్యక్తి స్టీల్‌ప్లాంట్ స్థలానికి ఆనుకుని ఉన్న 100 గజాలను ఆక్రమించాడని ఆరోపిస్తూ జీవీఎంసీకి స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు జీవీఎంసీ అధికారులు సదరు ప్రైవేట్ వ్యక్తి నిర్మించిన బిల్డింగ్ ప్లాన్ ఇతర పత్రాలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక అందించామని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు.

తమ భూములను చదును చేసుకుంటున్నాం..

- ఎర్రమట్టిదిబ్బలను కూలుస్తున్నామన్న వార్తల్లో వాస్తవంలేదు
- భీమునిపట్నం మ్యూచువలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ



భూముల వివరాలను చూపుతున్న సొసైటీ సభ్యులు

భీమునిపట్నం : భీమిలి బీచ్‌రోడ్డులోని ఎర్రమట్టిదిబ్బల పక్కనే ఉన్న తమ సొసైటీ భూములను చదును చేస్తుంటే కొందరు ఎర్రమట్టి దిబ్బలను కూలుస్తున్నామని వార్తలు రాయడంలో ఎటువంటి నిజం లేదని భీమునిపట్నం మ్యూచువలీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు జి.హరిగోపాల్ తెలిపారు. సోమవారం సొసైటీ సభ్యులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ సొసైటీ 1970లో స్థాపించబడిందని.. ఇందులోని సభ్యులకు ఇళ్ల స్థలాల కోసం 1983లో ఎర్రమట్టిదిబ్బల పక్కనే ఉన్న సర్వే నంబర్ 118లో 373.95 ఎకరాల భూములను అప్పటి మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నుంచి కొనుగోలు చేశామన్నారు. దీనిపై కొన్ని వివాదాలు రావడంతో సుప్రీం కోర్టులో కేసులు నడిచాయని.. 2009లో కోర్టు ఈ భూములను తిరిగి తమ సొసైటీకి అప్పగించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారు ఈ భూముల్లో కొంత ఎర్రమట్టిదిబ్బల భూములు ఉన్నాయని గుర్తించారని పేర్కొన్నారు. దాని ప్రకారం తమ భూముల్లో 91.50 ఎకరాలు ఎర్రమట్టిదిబ్బలు ఉన్నాయని.. ఇవి జియో హెరిటేజ్ భూములుగా గుర్తించారని అన్నారు. తమ భూమిలో ఆ మేరకు భూమిని వది లేయగా తమ సొసైటీకి మొత్తం 262.92 ఎకరాలు మిగిలాయని తెలిపారు. ఇందులో లేఅవుట్ వేయడానికి జీవీఎంసీకి రూ 5.64 కోట్లు చెల్లించామని ఇప్పుడు తమ భూములను చదును చేసుకునే పనులు ప్రారంభించామన్నారు. ఇందులో ఎర్రమట్టిదిబ్బలకు చెందిన భూమి ఎక్కడ లేదని.. కాని తాము ఆ భూముల్లో తవ్వకాలు, కూల్చివేతలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని ఇది బాధాకరమన్నారు. కచ్చితంగా తాము ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసిన భూముల్లో మాత్రమే చదును చేసుకుంటున్నామని దీన్ని అందరు గుర్తించాలని కోరారు. అలాగే ఎర్రమట్టి దిబ్బలకు కచ్చితమైన హద్దులను గుర్తించి దాన్ని ప్రకటిస్తే అప్పుడు ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఇందులో సొసైటీ ఉపాధ్యక్షుడు వి.నారాయణరావు, కార్యదర్శి వి.సూరిబాబు, డైరెక్టర్లు వి.టి.ఎన్.గుప్తా, ఎస్.శేషారత్నం, ఎస్.వీరభద్రరావు, కె.కుసుమకుమారి పాల్గొన్నారు.

సింహగిరి.. మేఘసిరి



సింహగిరిపై సోమవారం పెద్ద ఎత్తున మేఘాలు కనువిందు చేశాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయం వెనుక వైపు ఉన్నకొండపై నుంచి మేఘాలు ఆలయాన్ని తాకుతున్న దృశ్యాలను చూసి భక్తులు పరవశించారు. అలాగే సింహగిరి ఘాట్‌రోడ్డులో నుంచి కొండదిగువ అడవివరం వైపు చూసిన భక్తులకు అపురూప దృశ్యాలు కనువిందు చేశాయి. –ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గంగవరం పోర్టులో భారీ అగ్ని ప్రమాదం



కాలిపోతున్న కోల్ బెల్ట్

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో ఆదివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కోల్ కన్వేయర్ బెల్ట్‌కు మంటలు అంటుకోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. పోర్టు ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగవరం పోర్టు ప్రధాన గేటు నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే మార్గంలో సెయిల్‌లో యూనిట్ పక్కన 13వ నెంబర్ కన్వేయర్ బెల్ట్ పక్కన ఆదివారం రాత్రి వెల్డింగ్ పనులు చేస్తున్నారు. ఆ సమయంలో నిప్పు రవ్వలు ఎగిరి పడడంతో కన్వేయర్ బెల్ట్‌లోని బొగ్గుకు అగ్గి అంటుకుంది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోర్టు యాజమాన్య ప్రతినిధులు అక్కడకు హుటాహుటిన చేరుకున్నారు. పోర్టులోని అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సుమారు 3 గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కోల్ కన్వేయర్ బెల్ట్‌కు నిప్పు అంటుకుందని, సకాలంలో మంటలను అదుపు చేయడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టాన్ని తగ్గించామన్నారు. ఈ కోల్ బెల్ట్ నుంచి స్టీల్ ప్లాంట్‌కు నిరంతరం బొగ్గు సరఫరా చేస్తున్నామని తెలిపారు. మంటలను అదుపు చేసిన వెంటనే కన్వేయర్ బెల్ట్‌ను మార్చి యథావిధిగా బొగ్గును సరఫరా చేశామని వివరించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదని, కొంతమేర ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు.

కేర్‌లో రోబోటిక్ విధానంలో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స



సమావేశంలో మాట్లాడుతున్న కేర్ ఆర్థోపెడిక్ వైద్యులు

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీ కేర్ ఆస్పత్రిలో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స కోసం అత్యాధునిక ఆటోమేటెడ్ రోబోటిక్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మయూఖ్ చౌదరి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఈ విధానం ద్వారా మోకీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సను తక్కువ సమయం, నొప్పి లేకుండా, ఎక్కువ రక్తం వృథా కాకుండా చేయవచ్చన్నారు. ఈ పద్ధతిలో ఇద్దరికి శస్త్ర చికిత్స విజయవంతంగా చేసినట్లు తెలిపారు. రోగి 2 నుంచి 4 రోజుల్లో కోలుకుంటారన్నారు. అదే సాధారణ ఆపరేషన్ అయితే ఎక్కువ నొప్పితో పాటు కోలుకోవడానికి 6 నుంచి 8 రోజులు పడుతుందన్నారు. రోగిని స్కానింగ్ ద్వారా ముందుగానే పరిశీలించి ఒక ప్రణాళిక పద్ధతిలో అవసరం మేరకు గుర్తించిన భాగంలో మాత్రమే సర్జరీ చేయవచ్చన్నారు. వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా అవసరాన్ని రెండు కాళ్లకు ఒకేసారి శస్త్ర చికిత్స చేయవచ్చని చెప్పారు. సాధారణ శస్త్ర చికిత్స కంటే పూర్తి స్థాయి రోబోటిక్ విధానం ద్వారా మంచి ఫలితం కనిపిస్తుందన్నారు. ఈ సమావేశంలో కేర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కె.ఎస్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రాజేష్, డాక్టర్ రాజునాయుడు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో పలువురు న్యాయమూర్తులు

మహారాణిపేట: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై సోమవారం జిల్లా నూతన కోర్టుల సముదాయ భవనంలో ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జునైడ్ అహ్మద్, విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా ఇన్‌చార్జీ, జిల్లా సెషన్స్ జడ్జి యు.యు.ప్రసాద్, ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి (విశాఖపట్నం), సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వం- సంధి ప్రాజెక్ట్ కమిటీ సీనియర్ శిక్షకుడు (ఎంసీపీసీ, న్యూఢిల్లీ) సీ.హెచ్.సురేందర్ సింగ్, విపి తంకచన్, విశాఖ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ-కమ్-సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ డ్రాయింగ్ పోటీలో కనుమూరి ప్రతిభ



కళాకారుడు కనుమూరి శ్రీనివాసరావు

సీతంపేట: ఇటీవల దుబాయ్‌లో ఆన్‌లైన్‌లో జరిగిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో నగరానికి చెందిన కళాకారుడు, సమగ్ర శిక్షణ ఉపాధ్యాయుడు కనుమూరి శ్రీనివాసరావు మొదటి బహుమతి సాధించాడు. దుబాయ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సంస్థ రామాయణంలో సుందరకాండ ఘట్టంపై సంకట మోచన్ సీజన్–2 పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించింది. ఈపోటీలలో 6 దేశాలకు చెందిన 225 మంది చిత్రకారులు పాల్గొన్నారు. పబ్లిక్ నుంచి ఓటింగ్, జ్యూరీ సభ్యుల ఓట్ల ఆధారంగా 10/10 ఓట్లు సాధించడంతో కనుమూరి శ్రీనివాసరావు విజేతగా నిలిచాడు. దీనికి సంబంధించి ధ్రువపత్రం, జ్ఞాపిక, రూ.10వేలు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విజేత కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సుందరకాండలోని ప్రధాన ఘట్టాలను అన్ని ఒకచోట దర్శించేలా చిత్రాన్ని గీశానని చెప్పారు. ఎడమ వైపు విఘ్నాలు తొలగించే వినాయకుడు, కుడివైపు రాములవారు హనుమంతుడ్ని ఆశీర్వదించి.. ఉంగరం ఇచ్చి సీతమ్మను వెతకడానికి పంపించడం, లంకా నగరానికి వెళ్లడం, లంకిణి అడ్డగించడం, ఉంగరం సీతమ్మకు ఇవ్వడం, చూడామణి తీసుకుని కిష్కింధకు బయలుదేరడం వంటి సన్నివేశాలు చిత్రీకరించా. మధ్య భాగంలో సీతారామచంద్రుల ఆశీర్వచనాలు అందుకుంటున్న పంచముఖ హనుమంతుడు, అడుగు భాగంలో హనుమంతుడు సాధించిన విజయాలను కొనియాడుతూ దేవతా మూర్తులు నమస్కరిస్తున్నట్టు చిత్రాన్ని గీసినట్టు చెప్పారు. శ్రీనివాస్ సాధించిన విజయంపై సహచర కళాకారులు, పలువురు డ్రాయింగ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు అభినందించారు.